నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

3 | శనివారం 9 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




జైపూర్ : వేలాల గుట్టపైన క్యూ లైన్లలో భక్తులు



మంచిర్యాల ఏసీసీ : విశ్వనాథాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



మంచిర్యాల ఏసీసీ : గోదారి తీరంలో జన సందోహం



బెల్లంపల్లిరూరల్ : బుగ్గ లో రాజరాజేశ్వరుని దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



ఆసిఫా బాద్ : కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జైపూర్ : మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు



కాగజ్‌నగర్ టౌన్ : స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు



జైపూర్ : వేలాల గుట్టుపైకి బోనంతో వస్తున్న భక్తురాలు

- కనుల పండువగా కల్యాణోత్సవాలు
- భక్తులతో పోటెత్తిన జాతరలు
- పట్నాలు వేసి.. బోనాలు సమర్పణ
- ఉపవాస దీక్షలు.. రాత్రంతా జాగరణ
- ఆలయాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

# శంభోశంకర

## మహా శివరాత్రి సందర్భంగా మారుమోగిన శైవక్షేత్రాలు

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ‘ఓం నమ:శివాయ.. హర హర మహాదేవ.. శంభోశంకర..’ అంటూ సాగిన శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగాయి. ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న, కత్తెరశాల మల్లికార్జున స్వామి, బుగ్గ రాజరాజేశ్వర స్వామి, ఆసిఫాబాద్ జిల్లాలోని ఈస్‌గాం శివమల్లన్న.. తదితర ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. వేకువ జామునుంచే వాగులు, నదుల్లో పుణ్యస్నానాలు చేసి త్రినేత్రుడిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి.. బోనాలు సమర్పించారు. రుద్రాభిషేకాలు, శివ పార్వతుల కల్యాణం, లింగోద్భవ పూజలు కనులపండువగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రంతా జాగరణ చేశారు. పలు దేవస్థానాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయాచోట్ల ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



దండేపల్లి : గూడెం గోదావరిలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు



సీసీసీ నస్పూర్ : సీతారాంపల్లి పుష్కరఘాట్ వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

# అక్రమ దందాల్లో హస్తం

## ఎప్పుడెలా దోచుకుతిందామనే రీతిలో కాంగ్రెస్ నేతల వ్యవహారం

- రేషన్, ఇసుక, ఓసీ మట్టి తరలింపుల్లో జోక్యం
- డబ్బుల కోసం వేధిస్తున్నారంటూ ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేసిన ‘రేషన్ దందా వీరన్న’
- ఎంపీ ఎన్నికల ముందు ఇలాంటి పెంట పనులేమిటని మండిపడుతున్న అదే పార్టీ నాయకులు

మంచిర్యాల, మార్చి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ నేతల అక్రమ దందాలకు అడ్డూ.. అదుపు లేకుండా పోతున్నది. ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా దోచుకు తిందామనే రీతిలో వ్యవహరిస్తుండగా, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక, రేషన్ బియ్యం, ఓపెన్ కాస్టు మట్టి తరలింపు.. ఇలా అన్ని దందాల్లో చెన్నూర్ నియోజకవర్గ నాయకుల ‘హస్తం’ ఉన్నట్లు తెలుస్తున్నది. మహారాష్ట్ర లోని సిరోంచ కేంద్రంగా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో రేషన్ దందా చేసే వీరన్న గురువారం చెన్నూర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలవడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు, రేషన్ డీలర్ల నుంచి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించడంలో వీరప్పన్‌లాంటోడన్న ఆరోపణలు ఈయనపై ఉన్నాయి. ‘ఈయన పేరు చెప్తే చాలు.. సివిల్ సప్లయ్, పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకున్న బియ్యం సైతం వదిలేస్తారనే పేరు ఉంది. అర్ధరాత్రి 12 గంటలకు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుంటే.. తెల్లారే సరికి ఆ లెక్కలు రెండు, మూడు క్వింటాళ్లల్లోకి మారిపోతుంటాయంటరు.’’ పోనీ సిరోంచ పోయి చర్యలు తీసుకుందామంటే.. అది మన స్టేట్ కాకపాయే అంటూ.. అధికారులు ప్రతిసారి దాట వేస్తుంటారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకొని ఇన్ని రోజులు దందా నడిపిన వీరన్నను మూడు నెలలుగా కాంగ్రెస్ నాయకులు పట్టిపీడిస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్ మీదుగా సిరోంచ వెళ్లే రేషన్ బియ్యం లారీలను అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇటీవల ఓ కాంగ్రెస్ లీడర్ బ్లాక్‌మెయిల్ చేసి రూ.మూడున్నర లక్షలు వసూలు చేయగా, ఆ విషయం తెలుసుకున్న మరో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సైతం వీరన్న దగ్గర డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. కాగా ఈ విషయంపై రేషన్ దందా వీరన్న ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నారు. అక్రమ రేషన్ బియ్యం దందా చేస్తాడని తెలిసినా.. వీరన్నను ఎమ్మెల్యే కలవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దందా మానుకోమని మందలివ్వాల్సిన ఎమ్మెల్యే మెత్తగా మాట్లాడి పంపడం పలు విమర్శలు తావిస్తున్నది. కాంగ్రెస్ పార్టీకి కావాల్సిన ఫండ్ ఇస్తానని.. నా దందాకు ఎవ్వరూ అడ్డురాకుండా చూసుకోవాలనే ప్రపోజల్‌ను వీరన్న ఎమ్మెల్యే ముందు పెట్టినట్లు ఆ పార్టీ నాయకుల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి రేషన్ దందా వీరన్న వివేక్‌ను ఎందుకు కలిశారో, ఏం మాట్లాడారో తేలాల్సి ఉంది.



మార్చి 7 : ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ దందా వీరన్న

### అన్ని దందాల్లో కాంగ్రెసోళ్లే..

ఇక చెన్నూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు అన్ని దందాలను దగ్గరుండి నడిపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెన్నూర్ క్వారీల ఇసుకను అక్రమ మార్గాల్లో తరలించడంలో దిట్టగా పేరున్న ఓ మాజీ సర్పంచ్, ఇప్పుడు అధికారిక కాంగ్రెస్‌లో చేరాడు. మూడు నెలలుగా ఆయన యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్నారు. అనుమతి లేని క్వారీల నుంచి సైతం పట్టపగలే ఇసుకను తరలిస్తున్నా.. ఆపేవారు, అడిగేవారు లేకుండా పోతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ‘నమస్తే తెలంగాణ’లో కథనాలు వచ్చాయి. స్పందించాల్సిన మైనింగ్ శాఖ అధికారులు ‘‘మా దృష్టికి రాలేదు.. వస్తే చర్యలు తీసుకుంటాం’ అని చెప్పడం తప్ప.. ఏ ఒక్క రోజూ కూడా అటువైపు కన్నెత్తి చూసింది లేదు. దీనికి కారణం సదరు వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉండటమేనని తెలిసింది. మరోవైపు చెన్నూర్‌లో సీనియర్ నాయకుడిగా పేరున్న రాజిరెడ్డికి.. అదే పార్టీకి చెందిన హేమంత్‌రెడ్డికి అసలు పడడం లేదట. ఇద్దరూ ఒకరిపై మరొకరు నిత్యం ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి ఫిర్యాదులు చేసుకుంటున్నారట. దీంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో ఎమ్మెల్యే పడిపోయినట్లు తెలుస్తుంది. ఇక జైపూర్ మండలంలో కాంగ్రెస్ నాయకులకు పడటం లేదట.. ఓపెన్ కాస్టు నుంచి మట్టి తరలించే వ్యవహారం ఇక్కడ నాయకులు నేనంటే.. నేనంటూ కొట్టుకుంటున్నరట. ఇలా ఏ దందా చూసినా కాంగ్రెస్ నాయకుల పేర్లే వినిపిస్తుండడంతో పార్టీ పరువుపోతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ ఎన్నికల ముందు ఇలాంటి పెంట పనులు చేస్తే ప్రజలకు ముఖం ఎలా చూపించుకోగలమని బాధపడుతున్నారు. ఎన్నికలకు ముందు అక్రమ దందాలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వివేక్.. ఇప్పుడు తన కండ్ల ముందే అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అడ్డుకోకుండా ఏం చేస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు. మరి ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ దందాలు బంద్ చేయయని కాంగ్రెస్ నాయకులకు చెబుతారా.. లేక ఏం పట్టీపట్టనట్లు మిన్నకుండిపోతారా.. అనేది తేలాల్సి ఉంది.

# గండాలు తొలగించే గండ చిలుక

దండేపల్లి, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివుడికి ఉపవాస దీక్షలు చేసేవారు తమ ఇళ్ల ముందు రోకలి బండను పాతి దానిపై దీపాన్ని వెలిగించారు. గండచిలుక(గండ దీపం)గా పిలువబడే దీనిని వెలిగిస్తే గండాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో మహిళలు, యువకులు తమ ఇండ్ల ముందు గండదీపాలు వెలిగిస్తూ కనిపించారు. దీపం ముందు దేవున్ని మొక్కుతూ తమ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.



దీపం వెలిగించి మొక్కుతున్న మహిళ

# అందరూ పాసయ్యేలా చూస్తాం

## ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవిపై చర్యలు తీసుకుంటాం

- చింతలమానేపల్లి కేజీబీవీ విద్యార్థినులతో అధికారులు
- పలుమార్లు సముదాయించినా తిరిగి వెళ్లిపోయిన పిల్లలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి సుభాష్, ఎంఈవో, తదితరులు

చింతలమానేపల్లి , మార్చి 8 : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఎంపీసీ విద్యార్థినులు గురువారం హాస్టల్ వదిలి వెళ్లిన ఘటపై జిల్లా అధికారులు స్పందించారు. కస్తూర్బాను జిల్లా కేజీబీవీ ప్రత్యేక ఇన్‌చార్జి అధికారి సుభాష్, మండల విద్యాధికారి సోమయ్య, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ శుక్రవారం సందర్శించారు. గురువారం రాత్రి ఇళ్లకు వెళ్లిన 11 మందిని తిరిగి స్కూల్‌కు పిలిపించారు. హాస్టల్‌లో ఉండాలని, మిగిలిన పరీక్షలు రాయాలని విద్యార్థినులను అధికారులు కోరగా, ఇందుకు వారు ఒప్పుకోలేదు. మ్యాథ్స్ లెక్చరర్ లేక కనీసం పరీక్షలో అక్షరం కూడా రాయలేకపోయామని, ఈ విషయాన్ని ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవికి చెప్పుకుంటే.. పోలీస్ కేసులు పెడతామని ఆమె బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డీఈవో ఆదేశాల మేరకు ఇద్దరు పీజీ సీఆర్‌టీలను కూడా తీసుకువచ్చామని, వారితో మెరుగైన విద్య అందిస్తామని, అందరూ పాస్ అయ్యేలా చూస్తామని అధికారులు విద్యార్థినులకు భరోసా ఇచ్చారు. పలుమార్లు వారిని సముదాయించినా ఫలితం లేకుండా పోయింది. ఇక్కడుంటే తమకు వేధింపులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తూ విద్యార్థినులు వెళ్లిపోయారు. కాగా, తన తప్పేమీ లేదని ఇన్‌చార్జి ఎస్‌వో జిల్లా అధికారులకు చెప్పడం గమనార్హం. త్వరలోనే ఈ అంశంపై డీఈవోకు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు. కాగా, హాస్టల్‌లో మొత్తం 15 మంది విద్యార్థినులుండగా, ఇందులో 11 మంది వెళ్లిపోయారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉండగా, మరొకరు జ్వరంతో అంతకుముందే ఇంటికి వెళ్లిపోయినట్లు సమాచారం.



విద్యార్థిని అభినందిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

# సిద్ధాంత్ సాయి ప్రతిభ అభినందనీయం

నస్పూర్, మార్చి 8 : స్మార్ట్ ఫార్ములాతో ద్విచక్రవాహనాన్ని హెల్మెట్‌కు అనుసంధానించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం వల్ల జరుగుతున్నప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ హెల్మెట్‌ను తయారు చేసిన మంచిర్యాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి వెన్నంపల్లి సిద్ధాంత్‌సాయిని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు. సిద్ధాంత్ సాయి అసాధారణ ప్రతిభ కనబరిచాడని ఆయన కొనియాడారు.

# తమ్ముడి ఇంటి ఎదుట బైక్ తగులబెట్టిన అన్న



బైక్ దహనం చేస్తున్న యువకుడు

లక్షెట్టిపేట, మార్చి 8 : ఆస్తి వివాదంలో ఓ యువకుడు తన తమ్ముడి ఇంటి ఎదుట బైక్ తగులబెట్టుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రాబోర్ సమీపంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన జునైత్‌కు.. తన తమ్మునికి కొద్ది రోజులుగా ఆస్తి పంపకాల విషయమై వివాదం జరుగుతుంది. సొంత తమ్ముడే తనను మోసం చేస్తున్నాడని, తనపై చేతబడి చేపించడం వల్ల ఇటీవల బైక్ ప్రమాదం జరిగిందని, అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడని కంటతడి పెట్టుకున్నాడు. ఆ కోపంలోనే తన తమ్ముడి ఇంటిముందు బైక్‌పై పెట్రోల్ పోసి నిప్పుపెట్టినట్లు తెలిపాడు. పోలీసులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి బాధితుని నుంచి వివరాలు సేకరించారు.

# వేసే బోరును ఆపేసిన్రు

- ఇప్పల బోగుడ కాలనీ వాసుల ఆవేదన



బోర్ ఆపేసిన ప్రదేశాన్ని చూపిస్తున్న స్థానికులు

భీమారం, మర్చి 8 : ‘కాంగ్రెసోళ్లు మా కాలనీలో వేసే బోరును ఆపేసి.. వేరే చోటికి తీసుక పోయిన్రు. తాగు నీటికి మస్తు తిప్పలైతంది. మా గోస చూసి ఇక్కడ బోరు వేయించాలె’.. అంటూ మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఇప్పలబోగుడ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద నీటి ఎద్దడి ఉన్న చోట బోర్లు మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఇప్పల బోగుడకు బోర్‌వెల్ వచ్చింది. కాలనీ వాసులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. గంట తర్వాత భీమారం కాంగ్రెస్‌లోని మరో వర్గం వచ్చి ఆపేశారని, తమకు న్యాయం చేయాలని స్థానికులు కోరారు. ఈ విషయం కాంగ్రెస్ నాయకుడు పోడెటి రవి దృష్టికి తీసుకెళ్లగా, బోర్‌ను ఎమ్మెల్యే వివేక్ మంజూరు చేయించారని, మరో వర్గం వచ్చి ఆపడమేమిటని ప్రశ్నించారు. స్థానికులు భీమేశ్, నాగరాజు, సారయ్య, రవి, కిరణ్, రాజమల్లు, రజిత, నాగమణి, ఇస్లావత్ యమున ఉన్నారు.